క్లుప్తంగా

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేపట్టిన గుర్రం చైతన్యకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

ఎమ్మిగనూరుటౌన్: ప్లాస్టిక్ రహిత సమాజం, పర్యావరణ పరిరక్షణ కోసం నెల్లూరుకు చెందిన ఆర్యవైశ్య గుర్రం చైతన్య గత డిసెంబర్‌లో ప్రారంభించిన సైకిల్ యాత్ర ఆదివారం ఎమ్మిగనూరుకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు మరో 26 రాష్ట్రాల మీదుగా తాను చేపట్టనున్న సైకిల్ యాత్ర 5 వేల కిలోమీటర్ల మేర దాదాపు ఏడాదిన్నర పైగా కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణానికి వచ్చిన ఆయనకు ఆర్యవైశ్య సంఘ నాయకులు ఘనంగా స్వాగతం పలికి వాసవీ కళ్యాణ మండపంలో సన్మానించారు. అనంతరం మంత్రాలయం రహదారి వద్ద వీడ్కోలు పలికారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ

వెల్దుర్తి: కలుగొట్ల గ్రామానికి చెందిన గొంది ఎల్లస్వామి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రతి నెలలాగే పింఛన్ అందించేందుకు సోమవారం తెల్లవారజామున అతని ఇంటికి వెళ్లిన వలంటీర్ విజయ్ విషయం తెలుసుకున్నాడు. గ్రామంలో తన పింఛన్ల పంపిణీ పూర్తవగానే కర్నూలు ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న ఎల్లస్వామికి పింఛన్ రూ.2750 అందించాడు. లబ్ధిదారుడితోపాటు కుటుంబ సభ్యులు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, తాము ఉన్నచోటికే పింఛన్ పంపుతున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటామన్నారు.

టీడీపీలో ఎవరి వేడుకలు వారివే

ఆలూరు: ఆలూరు నియోజకవర్గం టీడీపీలో వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. నూతన సంవత్సర కార్యక్రమాల్లో భాగంగా ఎవరి వేడుకలు వారివే అన్నట్లుగా సంబరాలు సాగాయి. స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కోట్ల సుజాతమ్మ తన అనుచరులు, కార్యకర్తలతో కిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మాజీ ఇన్‌చార్జ్‌లు వైకుంఠం మల్లికార్జున చౌదరి, వైకుంఠం శివప్రసాద్ ఎల్లార్తి రోడ్డు సమీపంలోని ఇంటి ఆవరణలో కార్యకర్తలతో కలసి వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా మాజీ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడు అందుబాటులో లేకపోవడంతో ఆదోని పట్టణ కేంద్రంలో ఆయన అనుచరులతో కుమారుడు గిరి మల్లప్ప గౌడు సంబరాలను నిర్వహించారు. మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల కన్వీనర్లు, ఎవరి వద్దకు వెళ్లకపోయినా తిప్పలు తప్పవేమని ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయోమయానికి గురవుతూ అందరు నాయకులను కలసి శుభాకంక్షలు తెలియజేసి వెళ్లిపోయారు.

వైభవంగా చంద్రప్రభ వాహన సేవ



వేంకటేశ్వర స్వామికి చంద్రప్రభ వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని తిరుమల నగర్ శ్రీ వెంకటసాయి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామికి గజ, చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. అలయం నుంచి బయలుదేరిన పల్లకి ఓం శాంతి సర్కిల్ పట్టణ పురవీధుల్లో ఊరేగింది. భక్తులు భజన పాటలు పాడుతూ, కోలాటం వేస్తూ భక్తిని చాటుకున్నారు. ఆలయంలో పండ్లు, పూలతో, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం మహా రథోత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు యు.శ్రీనివాసులు తెలిపారు. అలాగే పట్టణంలోని ట్యాంక్ బండ్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక అలంకరణ చేపట్టారు.

పింఛన్ల పెంపు చరిత్రాత్మకం

ఆలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్లను విడతల వారీగా పెంచుతూ ప్రస్తుతం రూ.2,750కు పెంచి ఇవ్వడం చరిత్రాత్మకం అని ఎంపీపీ శ్రీరాములు అన్నారు. ఆదివారం ఆయన మొలగవల్లి గ్రామంలో అవ్వాతాతలకు పింఛన్లు పంపిణీ చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను అందిస్తామన్నారు. అనంతరం మొలగవల్లి గ్రామంలోని గిడ్డ ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో కల్యాణ మండపానికి భూమి పూజ చేశారు. మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఈరన్న, పీఎంసీ కమిటీ చైర్మన్ రామాంజినేయులు తదితరులు ఉన్నారు.

హామీలు నెరవేర్చిన జననేత

ఆలూరు: ఇచ్చిన హామీలు తూచ తప్పకుండా అమలు చేస్తూ ప్రజల హృదయాలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థానం సంపాదించుకున్నారని నాయకులు అన్నారు. ఆదివారం నియోజకవర్గంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నూతన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పింఛన్లను పంపిణీ చేశారు. అంతకుముందు గ్రామ సచివాలయాల ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆస్పరి మండలం తంగరడోణ గ్రామ సర్పంచ్ శంకరమ్మ జగనన్న చిత్రపటానికి పూలమాల వేసి పాలాభిషేకం నిర్వహించారు.

కొత్త ఏడాది మురి'పింఛన్' కానుక



హోసూరులో కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



జొహరాపురంలో అయ్యపురెడ్డికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ రామిరెడ్డి



మద్దికెరలో లక్ష్మన్నకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వెంకటేశులు, రామకృష్ణ.



గోనెగండ్లలో లబ్ధిదారురాలు నరసమ్మకు పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

పత్తికొండ రూరల్: పేదల ముఖంలో చిరునవ్వులు చూడటమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆదివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ నాగప్ప అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే శ్రీదేవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము విడతల వారీగా పెంచుతూ ప్రస్తుతం రూ.2750 అందిస్తున్నట్లు వివరించారు. ప్రతి అవ్వ, తాత, అక్క చెల్లెమ్మలతో పాటు దివ్యాంగులు సీఎం జగనన్నను మరోసారి గెలిపించి రుణం తీర్చుకోవాలని కోరారు. ఎంపీడీఓ పార్థసారథి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఎంపీటీసీ నెట్టేకల్, వైఎస్సార్‌సీపీ నాయకులు బళ్లారి మోహన్‌కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం పండుగలా జరుపుకున్నారు. నూతన సంవత్సరం కావడం పింఛను సొమ్ము రూ.250 పెంచి రూ.2750 అందించడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. మల్కాపురం గ్రామంలో సర్పంచ్ దేవేంద్రగౌడ్, సచివాలయ కన్వీనర్లు పెద్దయ్య, ఖాసీం, ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే బోడబండ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కడివెళ్ల హనుమంతు, అబ్బిలి నాగరాజు, వడ్డె మధు, వలంటీర్లు పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

నందవరం: మండల కేంద్రంతో పాటు జొహరాపురం, ముగతి, టి.సోమలగూడూరు, నాగలదిన్నె, పెద్దకొత్తిలి, కనకవీడు, పూలచింత తదితర గ్రామాలలో వలంటీర్లు ఆదివారం ఠంఛనుగా పింఛన్లు పంపిణీ చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు శనివారమే గ్రామ వలంటీర్ల పింఛన్ సొమ్ము అందజేడంతో వలంటీర్లు తెలవారుజాము నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్మును అందించారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ సొమ్ము రూ.2.750కు పెంచడంతో లబ్ధిదారులు సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో 7,271 పింఛన్లకుగానూ రూ. 2.08 కోట్లు విడుదలైంది. అందులో తొలిరోజు 5,772 మందికి (80 శాతం) పింఛన్లు అందించామని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు.

గోనెగండ్ల: పింఛన్ల పెంపుపై మండలంలోని అవ్వాతాతలు హర్షం వ్యక్తం చేశారు. పెంచిన పింఛన్ సొమ్మును ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ వలంటీర్లతో కలిసి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బందెనవాజ్ మాట్లాడుతూ అవ్వతాతల ముఖాల్లో చిరునవ్వు చూడడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. పింఛన్ సొమ్మును రూ.2,750కు పెంచి పెద్దమనసు చాటుకున్నారన్నారు. ఎంపీటీసీ రఫిక్, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.



మల్కాపురంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పింఛను లబ్ధిదారులు



ఆస్పరిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నేతలు



ఆగవేళిలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గుమ్మనూరు గ్రామంలో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం



హొళగుందలో లబ్ధిదారుడు బాషాకు పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైభవంగా యోగి నరసింహస్వామి రథోత్సవం



భక్తజనుల మధ్య కొనసాగుతున్న రథోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు గ్రామ సమీపంలోని తోటలో వెలసిన మహాత్మా యోగి నరసింహస్వామి రథోత్సవం అశేష భక్తజనుల మధ్యన ఆదివారం వైభవంగా జరిగింది మేళతాళాలు నడుమ స్వామివారి రథాన్ని భక్తులు లాగారు. తేరుపైకి భక్తాదులు అరటి పండ్లు విసిరి భక్తిని చాటుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిరువ్యాపారులు పలురకాలైన స్వీట్ దుకాణాలు, గాజుల అంగళ్లు, రంగుల రాట్నాలు ఏర్పాటుచేశారు. కుటుంబ సమేతంగా హాజరైన భక్తులతో తోట కిక్కిరిసిపోయింది.

భక్తుల అవస్థలు

వాహనాల పార్కింగ్‌కు అవసరమైన చర్యలు తీసుకోకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్వామివారి దర్శనార్థం స్కూటర్లు, జీపులు, ఆటోలు, వివిధ వాహనాల్లో భారీగా భక్తులు తరలివచ్చారు. హంద్రీ నీవా ప్రధాన కాలువ గుండా వెళ్లే దారి మొత్తం వాహనాలతో నిండిపోయి ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.


నేడు హొళగుందలో గ్రామసభ

హొళగుంద: స్థానిక పంచాయతీ కార్యాలయంలో నేడు గ్రామసభ జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఓ ప్రకటనలో కోరారు. సర్పంచ్ చలవాది రంగమ్మ, వైస్ సర్పంచ్ మీనాక్షి ఆధ్వర్యంలో వార్డు మెంబర్లతో కలిసి గ్రామసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల వ్యవస్థ ఇతర అన్నిటిపై దృష్టి పెట్టి ప్రజా సమస్యలతో పాటు పంచాయతీ నిధుల వినియోగం, పంచాయతీకి చేకూరే వనరులు, ఇతర పలు అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. వార్డు సభ్యులతో పాటు గ్రామస్తులు గ్రామసభకు హాజరు కావాలన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబు



ముస్తాబైన రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం



శ్రీరంగాపురం కొండల్లో వెలసిన పాలుట్ల రంగస్వామి ఆలయం

వెల్దుర్తి/కృష్ణగిరి: ధనుర్మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశిగా జరుపుకుంటాం. ఉత్తరాయణ ప్రారంభ దినం కావడం మూలాన ఇది అత్యంత విశిష్టమైనది. ఈ ఏకాదశి రోజున విష్ణుమూర్తి గరుడ వాహనదారుడై ఉత్తర ద్వారాన దర్శమిస్తాడని ప్రతీతి. ఆ దివ్యమూర్తిని దర్శించుకోవడానికి ముక్కోటి దేవతలంతా దివి నుంచి భువికి దిగావస్తారని అందుకే ఈ రోజును 'ముక్కోటి ఏకాదశి' అని కూడా పిలుస్తారు. ఈ రోజు స్వామి దర్శనంతో భక్తులకు ముక్తి లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

ముక్కోటి వైకుంఠ ఏకాదశిని పర్వదినం పురస్కరించుకుని సోమవారం వైష్ణవ ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల ఉత్తర ద్వార దర్శనానికి అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వైకుంఠంలోని అన్ని స్వర్గ ధారాలు తెరుచుకునే సమయంలో శ్రీ మహావిష్ణువును దర్శించుకుంటే పుణ్యం, వైకుంఠ ప్రాప్తి లభిస్తుందన్న నమ్మకంతో వచ్చే భక్తుల కొరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు పలు చోట మనోరంజక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

- సత్యపీఠంగా భావించే పచ్చల బండ కలిగిన మహిమాన్విత రామళ్లకోట వనం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరుని ఆలయంలో తెల్లవారుజామున ప్రత్యేక పూజలనంతరం 4.15 గంటల నుంచి స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. మధ్యాహ్నం 11.15 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. భక్తుల రాకపోకలకు రామళ్లకోట ఆటో యూనియన్ ద్వారా ఉచిత ఆటో సేవ లభించనుంది.
- డోన్ చిన్నమల్కాపురం ఫారెస్ట్ బీట్‌లో ప్రకృతి అందాల మధ్య వెల్దుర్తి, బేతంచెర్ల మండలాల బోర్డర్, వెల్దుర్తి మండల రెవెన్యూ పరిధిలో వినాయక, వాసుదేవ, లోవేన, గోవులసేల, కాటమరాజు, వేకులవీడు, మేరుపుల పేర్లతో పిలిచే ఏడుకొండల నడుమ పాలుట్ల రంగనాథ స్వామి కొలువై ఉన్నాడు. ఈ ఆలయంలో సోమవారం ఉదయం 5.30 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం, 11.15 గంటలకు కళ్యాణోత్సవం, 12 గంటలకు మైసూరు గుర్రం నాట్య విన్యాసం, సాయంత్రం రథోత్సవం, నందికోల సేవలు, సప్తమాంకమం నాటకం ఉంటాయని ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. అదే రోజు ఉదయం న్యూ కేటగిరి వృషభాలకు బండలాగుడు పోటీలు, మధ్యాహ్నం గుండు ఎత్తే పందెం నిర్వహించనున్నారు.
- అలాగే మదార్‌పురం లక్ష్మీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం, కళ్యాణ మహోత్సవం, పల్లకీసేవ, ఆర్కెస్ట్రా, చెక్క భజనలు నిర్వహించనున్నారు. వెల్దుర్తి జర్నలిస్ట్ కాలనీలోని ఆలయాల సమూహంలో వేంకటేశ్వరస్వామి వారి ఉత్తర ద్వార దర్శనం, కళ్యాణం జరుగనున్నాయి.
- కృష్ణగిరి మండలంలోని కర్లకుంటలో భూదేవి, శ్రీదేవి సమేత తిరుమలరాయుని ఆలయం ఉత్తర ద్వారంతోనే నిర్మితమైంది. ఇక్కడ ప్రతేడాది ముక్కోటి ఏకాదశి మహోత్సవాలను గ్రామస్తులు వైభవంగా జరుపుతున్నారు. ఈ ఆలయంలో సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాత సేవతో వైకుంఠ ఏకాదశి వేడుకలు ప్రారంభమవుతాయి. 5 గంటలకు తిరుమంజనసేవ, గోపూజ, 7 గంటలకు ఉత్తర ద్వార పూజ అనంతరం ప్రవేశం, భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. 9 గంటలకు సుదర్శన హోమం, 11 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు గ్రామోత్సవం, 5 గంటలకు వైకుంఠ ఏకాదశి విశిష్టత గురించి గండ్లూరి దత్తాత్రేయ శర్మ గారిచే ప్రవచన కార్యక్రమం, అన్నమాచార్య సంకీర్తల సంగీత విభావ కచేరి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నూతన సంవత్సరంలో శుభాలు కలగాలి



ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని గజమాలతో సత్కరిస్తున్న జొన్నగిరి వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎర్రకోట జగన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ శ్రేణులు తదితరులు



ఎంపీపీ కంగాటి వెంకటరామిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం



గోనెగండ్లలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ నసురుద్దీన్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

పత్తికొండటౌన్: నూతన సంవత్సరం ప్రజలందరికీ శుభాలు కలగాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆకాంక్షించారు. ఆదివారం పత్తికొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలు న్యూఇయర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా సందడి నెలకొంది. అధికారులు, రాజకీయ పార్టీల నాయకులను కలసి ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలసి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి న్యూ ఇయర్ వేడుకలను జరుపుకున్నారు. పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని కలిసి పూలమాలలు, బొకేలు, పండ్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌డీఓ మోహన్‌దాసు, డీఎస్పీ శ్రీనివాసులు, అర్బన్, రూరల్ సీఐలు మురళీమోహన్, రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పత్తికొండ మార్కెట్ కమిటీ చైర్మన్ పక్కీరప్ప, ఎంపీపీలు నారాయణదాసు, ఆదెమ్మ, అనితాయాదవ్, జెడ్పీటీసీ సభ్యులు ఉరుకుందమ్మ, పులికొండ నాయక్, మురళీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, మండల కన్వీనర్లు నాగరాజు, జిట్టా నాగేశ్, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుంతాదేవి, జొన్నగిరి రఘు, సర్పంచులు వేడుకల్లో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు మురళీధర్‌రెడ్డి స్థానిక తేరుబజారులో పోచిమిరెడ్డి సేవాదళ్ కార్యాలయాన్ని ప్రారంభించారు.

వెల్దుర్తి: తమ అభిమాన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ రెడ్డి, వారి కుటుంబీకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సోమవారం చెరుకులపాడు గ్రామం కిక్కిరిసింది. పూలమాలలు, పూలబొకేలు హోరెత్తగా పలువురు నాయకులు, అధికారులు పెన్నులు, పుస్తకాలు, పూలమొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బొమ్మన దశరథరామిరెడ్డి, సమీర్‌కుమార్ రెడ్డి, బొమ్మన పెద్దిరెడ్డి అగస్టీన్ తదితరుల స్వగృహాల వద్ద అభిమానులు, కార్యకర్తల మధ్య కేక్ కటింగ్‌లు జరిగాయి. డిసెంబర్ 31 రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు 63 చర్చిలలో ప్రార్థనలు, మత బోధనలు, పలు సేవా కార్యాక్రమాలు, కేక్ కటింగ్‌లు జరిగాయి. అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా సెక్రటరీ బ్రదర్ పి వేదాంతం ఆధ్వర్యంలో పేదలకు నూతన వస్త్రాల పంపిణీ జరిగింది. చెరుకులపాడులో ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి చిన్నారులతో కలిసి నూతన సంవత్సర సంబరాల్లో పాల్గొన్నారు.

కృష్ణగిరి: నూతన సంవత్సర వేడుకల్లో బాగంగా ఆదివారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితోపాటు రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌కుమార్ రెడ్డి, కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, అన్ని శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి, పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు, సొసైటీ చైర్మన్ బ్రహ్మనందరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి నక్క నాగరాజు, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో 2023 నూతన సంవత్సర వేడుకలను యువకులు, విద్యార్థులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. యువకులు, విద్యార్థుల్లో నూతనోత్సాహం ఉవ్వెత్తున ఎగిసి పడింది. యువత ఆటపాటలతో ఉర్రూతలూగారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డికి వివిధ గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పూల మొక్కలు, నోట్ పుస్తకాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మిగనూరుటౌన్: నూతన సంవత్సర వేడుకలు ఆదివారం పట్టణంలో అట్టహాసంగా జరిగాయి, స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డికి వందలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, మహిళా నాయకులు, మెప్మా సిబ్బంది, పట్టణంలోని కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలతో ముంచెత్తారు. స్థానిక టౌన్‌బ్యాంక్‌లో పాలకవర్గం సభ్యులు కేక్ కట్ చేసి డైరెక్టర్లతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్, ఎంపీపీ కేశన్న, లక్ష్మీకాంత రెడ్డి, గోనెగండ్ల, నందవరం మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: 2023 నూతన సంవత్సర వేడుకలను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ టి.నసురుద్దీన్, మాజీ కో–ఆప్షన్ మెంబర్ బందెనవాజ్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ కార్యకర్తలు, నాయకులు, అధికారులతో ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఉదయాన్నే మండలం నుంచి ఆయా గ్రామాల ప్రజలు, కార్యకర్తలు, తండోపతండాలుగా తరలివచ్చి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్ పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

మద్దికెర: కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్పీటీసీ దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ డీఎస్ అనితయాదవ్, సర్పంచులు బండారి సుహాసిని, మల్లికార్జున, విజయుడు, తదితరులు ఆకాంక్షించారు. మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, వీఆర్వోలు స్థానిక ప్రజాప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పింజరి సుభాన్ (ఫైల్)

గోనెగండ్ల: మండలంలోని పెద్దమరివీడు గ్రామానికి చెందిన పింజరి సుభాన్ (30) చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. వివరాలు.. పెద్దమరివీడు గ్రామానికి చెందిన పింజరి సుభాన్ కడుపునొప్పి తాళలేక డిసెంబర్ 29న మధ్యాహ్నం ఇంట్లో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సుభాన్‌ను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. సంవత్సరం క్రితం అతని భార్య హసీనా అనారోగ్యంతో మృతిచెందింది. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి అన్న పింజారి రంజిత్ ఇచ్చిన ఫిర్యాదుమేరకుకేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

అనాథలైన చిన్నారులు

పెద్దమరివీడు గ్రామానికి చెందిన పింజరి సుభాన్, హసీనాలకు కుమారుడు ఇర్ఫాన్ (5), కుమార్తె అప్సనా (3) ఉన్నారు. దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. సంవత్సరం క్రితం హసీనా, ప్రస్తుతం సుభాన్ మృతిచెందడంతో పిల్లలు అనాథలుగా మిగిలారు. ప్రస్తుతం సుభాన్ తల్లి కాశీంబీ వద్ద పిల్లలు ఉన్నారు. అనాథలుగా మిగిలిన చిన్నారులను ఎవరైనా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.